


సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం గురువారం 562.40 అడుగుల వద్ద ఉంది. కుడి కాలువకు 9,800 క్యూసెక్కులు విడుదలవుతోంది.



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ డెల్టా ప్రధాన కాలువకు సీతానగరం వద్ద గురువారం 1616 క్యూసెక్కులు విడుదల చేశారు.



దుర్గమ్మ గుడికి రూ.లక్ష విరాళం

విజయవాడ: ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో నిత్యాన్నదానానికి తూర్పుగోదావరి జిల్లాకు చెందిన శైలేంద్రనాథ్ కుటుంబం గురువారం రూ.లక్ష విరాళాన్ని అందజేసింది.

న్యూస్‌రీల్

జాతీయ భద్రతా మాసోత్సవాలు ప్రారంభం



నరసరావుపేట: జిల్లాలో గురువారం నుంచి జాతీయ భద్రతా మాసోత్సవాలు ప్రారంభమయ్యాయి. పోలీసు, కలెక్టరేట్ కార్యాలయాల్లో ఎస్పీ కంచి శ్రీనివాసరావు, జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ గనోరే రోడ్డు భద్రతా బ్యానర్లు, బ్రోచర్లు ఆవిష్కరించి మాసోత్సవాలను ప్రారంభించారు. ఈ మాసోత్సవాలు ఈనెల 16 నుంచి ఫిబ్రవరి 15 వరకు నిర్వహిస్తున్నామని జిల్లా రవాణాశాఖ అధికారి జి.సంజీవకుమార్ పేర్కొన్నారు. రవాణా శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ఈనెల 10 నుంచి 16 వరకు ప్రైవేటు బస్సులపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించి అధిక చార్జీలు వసూలు చేసినందుకు 38 బస్సులపై కేసులు నమోదు చేశామని పేర్కొన్నారు. మరికొన్ని వాహనాలపై 74 కేసులు నమోదు చేశామన్నారు. కార్యక్రమంలో మోటారు వాహన తనిఖీ అధికారి ఎస్.శివనాగేశ్వరరావు, సహాయ మోటారు తనిఖీ అధికారులు ఎం.మనీషా, ఎంఎల్.వంశీకృష్ణ, ఎం.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ క్యాడెట్ల ట్రెక్కింగ్ శిబిరం



గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరు ఎన్‌సీసీ గ్రూప్, 10 ఆంధ్ర గర్ల్స్ బెటాలియన్ ఆధ్వర్యంలో తొలిసారిగా ట్రెక్కింగ్ శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు గుంటూరు ఎన్‌సీసీ గ్రూప్ కమాండర్ కల్నల్ ఎస్.ఎం.చంద్రశేఖర్ తెలిపారు. అఖిల భారత మహిళా ట్రెక్కింగ్–3 పేరుతో గురువారం నుంచి ఈనెల 23 వరకు శిబిరంలో భాగంగా కొండవీడు, ఫిరంగిపురం కొండ, కోటప్పకొండలలో ఎన్‌సీసీ క్యాడెట్లు ట్రెక్కింగ్ నిర్వహించనున్నారని పేర్కొన్నారు. ఇందు కోసం ఆంధ్ర, తెలంగాణ పరిధిలోని తొమ్మిది ఎన్‌సీసీ గ్రూపులకు చెందిన దాదాపు 600 మంది విద్యార్థినులు గురువారం గుంటూరులోని ప్రభుత్వ మహిళా కళాశాలకు చేరుకున్నారని చెప్పారు.

ఉరుసు సందర్భంగా ట్రాఫిక్ మళ్లింపు

పట్నంబజారు(గుంటూరు ఈస్ట్): ఈనెల 17 నుంచి 21 వరకు జరగనున్న హజరత్ కాలే మస్తాన్‌షా వలియా దర్గా ఉరుసు ఉత్సవాల్లో భాగంగా ట్రాఫిక్ మళ్లించినట్టు ట్రాఫిక్ డీఎస్పీ ఎం.రమేష్ తెలిపారు. చుట్టుగుంట వైపు నుంచి మున్సిపల్ ట్రావెల్స్ బంగ్లా (ఎంటీబీ) సెంటర్ వైపు వచ్చే కార్లు, అంతకంటే భారీ వాహనాలు ఐటీసీ కంపెనీ, నగరంపాలెం పోలీసు స్టేషన్, ఎస్‌బీఐ సెంటర్ మీదుగా ఎంటీబీ సెంటర్‌కు చేరుకోవాలని సూచించారు. చుట్టుగుంట నుంచి వచ్చే ద్విచక్ర వాహనాలు, ఆటోలు చక్కల బజారు, మూడు బొమ్మల సెంటర్ మీదుగా ఎంటీబీ సెంటర్‌కు వెళ్లాలని తెలిపారు. గుంటూరు నగరం నుంచి చుట్టుగుంట వైపు వెళ్లే వాహనాలు యథావిధిగా వెళ్లవచ్చని సూచించారు.

20 నుంచి ఇంటర్ ప్రీ-ఫైనల్స్ పరీక్షలు

గుంటూరు ఎడ్యుకేషన్: ఇంటర్మీడియెట్ విద్యార్థులకు ఈనెల 20 నుంచి 27వ తేదీ వరకు ప్రీ-ఫైనల్ పరీక్షలు జరగనున్నాయి. జిల్లాలోని ప్రభుత్వ, ఎయిడెడ్ జూనియర్ కళాశాలలతో పాటు హైస్కూల్ ప్లస్‌లలో చదువుతున్న విద్యార్థులకు ఇంటర్మీడియెట్ బోర్డు నుంచి ప్రశ్నపత్రాలు పంపిణీ చేయనున్నారు. జిల్లాలోని నాలుగు ప్రభుత్వ జూనియర్ కళాశాలలతో పాటు ఆరు ఎయిడెడ్, ఐదు కాంపోజిట్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ప్రశ్నపత్రాలు సరఫరా చేయనున్నట్లు ఆర్ఐవో జీకే జుబేర్ తెలిపారు. ఇంటర్‌బోర్డు నిబంధల మేరకు ప్రీ-ఫైనల్స్ పరీక్షల నిర్వహణపై ఆయా కళాశాలల ప్రిన్సిపాల్స్‌కు మార్గదర్శకాలు జారీ చేసినట్లు చెప్పారు. అదే విధంగా ప్రైవేటు జూనియర్ కళాశాలల పరిధిలో ప్రీ-ఫైనల్ పరీక్షల నిర్వహణకు కళాశాలల యాజమాన్యాలు ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు.

60,180 బస్తాల మిర్చి రాక

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు గురువారం 60,180 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 59,267 బస్తాల అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల సగటు ధర రూ.7,500 నుంచి రూ.15,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల సగటు ధర రూ.7,500 నుంచి రూ.16,000 వరకు ధర లభించింది.

పసుపు సౌభాగ్యం దక్కేనా!

- దిగుబడి తగ్గుతుందని దిగులు
- అధిక వర్షాలు, ప్రతికూల వాతావరణమే కారణం
- నగటున ఎకరాకు ఐదు టన్నుల దిగుబడి తగ్గే అవకాశం
- మార్కెట్ ధరలపైనే ఆశలు

భరోసా లేక రైతుల ఆందోళన



పసుపు పైరు

తెనాలి/కొల్లిపర: ఏపుగా పెరిగి, పచ్చని పసిమితో కళ్ల ముందు కళకళలాడుతున్న పసుపు పైరు రైతుకు సంతృప్తినివ్వడం లేదు. భూమిలో దుంప చక్కగా ఊరుతుందన్న భరోసా లేదు. పంట దున్నేనాటికి ఆశించిన దిగుబడి రాదనే గుబులుతో రైతులు ఉన్నారు. ఖరీఫ్ సీజనులో అధిక వర్షాలు, అల్పపీడనాలు, ప్రతికూల వాతావరణంతో కొన సాగటమే పైరుకు చేటు తెచ్చింది. అక్కడక్కడా తెగుళ్లు ఆశించాయి. ప్రస్తుతం మార్కెట్లో మంచి ధర ఉండటమే రైతులకు కొంచెం ఊరటనిచ్చే అంశం. పసుపు మార్కెట్‌కు వచ్చేవరకు ఇవే ధరలు ఉండాలని కోరుకుంటున్నారు.

ధర ఆశాజనకం

దిగుబడి తగ్గినప్పటికీ మార్కెట్ ధర నిలకడగా ఉండాలని రైతులు కోరుకుంటున్నారు. ప్రస్తుతం ధర ఆశాజనకంగానే ఉంది. దుగ్గిరాల యార్డులో క్వింటాలు రూ.11 వేల వరకు ధర పలుకుతోంది. పంట చేతికొచ్చేసరికి ఈ ధరలు పెరిగితే ఒడ్డున పడతారు. గతేడాది కల్లాల్లోనే రూ.12 వేల ధర పలికిందని రైతులు గుర్తు చేస్తున్నారు.

పెరిగిన సాగు విస్తీర్ణం

తెనాలి నియోజకవర్గంలోని 2,300 ఎకరాల్లోను, వేమూరు నియోజకవర్గంలో సుమారు 3000 ఎకరాలలో రైతులు పసుపు సాగు చేశారు. ఇందులో అధిక శాతం కొల్లిపర మండలంలోనే ఉంది. కృష్ణా నదికి వరదల కారణంగా లంక భూముల్లో దాదాపు 800 ఎకరాల వరకు పంట దెబ్బతింది. ప్రస్తుతం 1,500 ఎకరాలు మాత్రమే సాగులో ఉంది. ఖరీఫ్ సీజను లో నాటిన పసుపు జనవరి, ఫిబ్రవరి నెలల్లో చేతికొస్తుంది. వాస్తవానికి 2023లో పసుపుకు మార్కెట్ ధర పతనం కావడంతో ఆ ఏడాది కొందరు రైతులు సాగుకు విముఖత చూపారు. 2024 సీజనులో అనూహ్యంగా ధర పెరిగింది. ప్రారంభంలో క్వింటాలు రూ.5వేలకు కాస్త అటూఇటూగా ఉన్న ధర పెరుగుతూ రూ.14,800 వరకు పలికింది. 2024–25 ఖరీఫ్ సీజనులో సాగు విస్తీర్ణం కొంత పెరిగింది.

పెట్టుబడి అధికం

ఇతర పంటలతో పోలిస్తే పసుపుకు ఖర్చులు అధికం. గతేడాది మార్చిలో పెరిగిన మార్కెట్ ధరలతో విత్తనం ధర కూడా భారీగానే పెరిగింది. ఎకరాకు ఆరు పుట్ల చొప్పున నాటుతారు. ఒక్కో పుట్టి ధర రూ.10 వేలకు రైతులు కొనుగోలు చేశారు. విత్తనం నాటడం నుంచి ఎండు పసుపు చేతికొచ్చే సరికి ఒక్కో ఎకరాకు కనీసం రూ.1.50 లక్షల పెట్టుబడి పెట్టాల్సి వస్తోంది. కౌలు రైతులకు రూ.50 వేలు అదనం.

వెంటాడిన ప్రతికూల వాతావరణం

భారీ పెట్టుబడితో సాగుచేస్తున్న పసుపు పైరును ఖరీఫ్ సీజనులో ఆది నుంచి ప్రతికూల వాతావరణమే వెంటాడింది. ఆగస్టు, సెప్టెంబరులో కురిసిన భారీవర్షాలతో పల్లపు చేలల్లో నీరు నిలిచింది. కృష్ణానది ఒడ్డున గల లంక చేలు వరదల్లో మునిగిపోయాయి. నీరు నిలిచిన చేలల్లో అక్కడక్కడా దుంపకుళ్లు, తాటాకు తెగులు సోకాయి. భూమిలో పసుపు దుంప ఊరే సమయంలో గత డిసెంబరులో అల్పపీడనం కారణంగా నెల మొత్తం ముసురు వాతావరణం నెలకొంది. సూర్యరశ్మి పెద్దగా లేకపోవడంతో ఈసారి ఎకరాకు కనీసం అయిదు క్వింటాళ్ల దిగుబడి తగ్గే అవకాశం ఉందని రైతులు చెబుతున్నారు.

మార్కెట్‌పైనే ఆశలు



నేను నాలుగెకరాల్లో పసుపు సాగు చేశా. కరకట్టకు దిగువనున్న పొలంలో పైరు వరదలకు దెబ్బతింది. మెరకలో ఉన్న చేలల్లో సాగుకు కౌలు రూ.50 వేలు, విత్తనం రూ.70 వేలు చొప్పున ఖర్చులతో కలుపుకుంటే ఎకరాకు రూ.2 లక్షల పడుతోంది. దిగుబడి చూస్తే 20–25 క్వింటాళ్లకు మించి రాకపోవచ్చు. మార్కెట్ ధర బాగుంటే ఒడ్డున పడతా. – భీమవరపు కిశోర్‌రెడ్డి, కొల్లిపర

మంచి రేటు లేకపోతే నష్టం



నేను ఎకరం పొలంలో పసుపు వేశా. అధిక వర్షాలు, అల్పపీడనం ప్రభావంతో నెలరోజులకు పైగా మబ్బులు పట్టి ఉండటం పసుపుకు ప్రతికూలంగా తయారైంది. దీంతో దుంప పెద్దగా ఊరదు. నాకు 20 క్వింటాళ్లకు మించి చేతికి రాదని అనుకుంటున్నా. మార్కెట్లో మంచి రేటు లేకపోతే నష్టపోక తప్పదు.
– భీమవరపు సుబ్బారెడ్డి, గుడిబండివారిపాలెం

రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించాలి



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న జిల్లా కలెక్టర్, అధికారులు

జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి

బాపట్ల: రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వాహన చోదకులకు అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి అన్నారు. జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలను జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి గురువారం ప్రారంభించారు. కలెక్టరు కార్యాలయంలో రహదారి భద్రతకి సంబంధించిన ప్రచార బ్యానర్స్, పోస్టర్స్‌ను ఆయన విడుదల చేశారు. రహదారి భద్రతా మాసోత్సవాలు ఫిబ్రవరి 15 వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. రోడ్డు ప్రమాదాల వలన ఎన్నో కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని, ఇది చాలా బాధాకరమని అన్నారు. ప్రమాదాల సంఖ్యను జీరో కు తీసుకొచ్చేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. రహదారి భద్రత అందరి బాధ్యత అని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరిలో రహదారి భద్రతపై అవగాహన పెంచేందుకుగాను రహదారి భద్రతలో అనుబంధ శాఖలు అయిన రవాణా, పోలీస్, రహదారి ఇంజినీరింగ్, వైద్య, ఆరోగ్య శాఖల అధికారులు సమన్వయంతో కలసి పనిచేయాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లా రవాణా శాఖ అధికారి టి.కె.పరంధామరెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ విజయమ్మ, డీసీహెచ్ ఎస్ శేషుకుమార్, బాపట్ల డిపో మేనేజర్ బి.శ్రీమన్నారాయణ, రోడ్ సేఫ్టీ ఎన్జీఓ రాజా సాల్మన్, రవాణా శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

అండర్–14 జట్టుకు బాపట్ల విద్యార్థి అబ్దుల్ సాద్ ఎంపిక



అబ్దుల్ సాద్

బాపట్ల: అండర్–14 క్రికెట్ ఆంధ్ర జట్టులో బాపట్ల విద్యార్థి అబ్దుల్ సాద్ ఉనైస్‌కు అవకాశం దక్కింది. గత నెలలో జరిగిన అండర్–14 జిల్లా స్థాయి ఎంపికల్లో తొలిసారిగా పాల్గొని గుంటూరు జిల్లా జట్టుకు ఎంపికయ్యాడు. కృష్ణా, చిత్తూరు, నెల్లూరు, విజయనగరం, శ్రీకాకుళం, అనంతపూర్, విశాఖపట్నం జిల్లాలతో జరిగిన పోటీల్లో తన ప్రతిభ కనబర్చాడు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన 60 మంది క్రీడాకారుల్లో సాద్ స్థానం దక్కించుకున్నాడు. చివరిగా విజయనగరంలో జరిగిన జోనల్ పోటీల్లో 17 మందితో కూడిన ఆంధ్ర అండర్–14 క్రికెట్ జట్టుకు ఎంపిక చేశారు. అందులో అబ్దుల్ సాద్ కూడా ఒకరు కావడం విశేషం. ఈ నెల 27 నుంచి ఫిబ్రవరి 18వ తేదీ వరకు పాండిచ్చేరిలో జరిగే రాష్ట్రస్థాయి అండర్–14 పోటీల్లో అబ్దుల్ సాద్ పాల్గొనబోతున్నారు. అద్భుతమైన ప్రతిభ కనబరిచిన అబ్దుల్ సాద్‌ను ఉత్తమ క్రీడాకారుడుగా తీర్చిదిద్దటంలో కృషిచేసిన కోచ్ అమీర్‌ను పలువురు అభినందించారు. కార్యక్రమంలో బాపట్ల క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి రామ్మోహన్, స్టాన్లీ విమల్‌కుమార్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు. అబ్దుల్ సాద్‌కు పలువురు క్రీడాకారులు, పుర ప్రముఖులు అభినందనలు తెలిపారు. మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్–14 స్టేట్ టీంలో బాపట్ల విద్యార్థి అబ్దుల్ సాద్‌కు అవకాశం దక్కటం అభినందనీయమని బాపట్ల క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షులు రఘునాథ్ అన్నారు.

క్యారమ్స్ క'మనీ'యం

- ఐపీఎల్ తరహాలో డీపీసీఎల్
- దేశంలోని అత్యుత్తమ ప్లేయర్స్ సమరం
- బహుమతుల విలువ రూ.12 లక్షలు పైమాటే
- నేటి నుంచి విశాఖలో టోర్నీ ప్రారంభం



మ్యాచ్‌ల కోసం సిద్ధంగా ఉన్న గ్రీన్ క్యారమ్ బోర్డ్

గుంటూరు వెస్ట్: క్యారమ్స్ అంటే అతి సాధారణ క్రీడగా కొందరు భావిస్తారు. అయితే రాణిస్తే ఇందులోనూ పేరు ప్రఖ్యాతులతోపాటు రూ.కోట్లు పొందవచ్చు. తమిళనాడుకు చెందిన ఎ.మరియ ఇరుదయంకు ఇదే క్రీడలో అర్జున అవార్డు(1996) లభించింది. గత ఏడాది అమెరికాలో జరిగిన 6వ ప్రపంచ కప్ క్యారమ్స్ చాంపియన్‌షిప్‌లో తమిళనాడుకు చెందిన 17 ఏళ్ల ఖాజీమా మహిళా విభాగంలో ప్రపంచ విజేతగా నిలిచారు. దీంతో ఆ రాష్ట్ర ప్రభుత్వం ఆమెకు రూ.కోటి బహుమతి ఇచ్చింది.

డీపీసీఎల్ సిద్ధం

క్యారమ్స్‌లోనూ ఐపీఎల్ తరహా టోర్నీ డెక్కన్ ప్రీమియర్ క్యారమ్స్ లీగ్(డీపీఎల్) 2022 నుంచి జరుగుతోంది. ఈ ఏడాది సీజన్–3 జరగనుంది. దేశంలోని అత్యుత్తమ ప్లేయర్స్‌ను ఒకే వేదికపైకి తెచ్చి వారి ప్రతిభకు చక్కని నజరానా అందించే టోర్నీ ఇది. సీజన్–3ని వజ్రా స్పోర్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ నిర్వహించనుంది. ప్రముఖ క్యారమ్స్ క్రీడాకారులను వేలంలో కొనుగోలు చేసి వారిని బృందాలుగా విభజించి పోటీలు నిర్వహిస్తుంది. టోర్నీలో రూ.12 లక్షలకుపైగానే విజేతలకు బహుమతుల ద్వారా అందించనున్నారు. వీరికి ఆంధ్రా క్యారమ్స్ అసోసియేషన్ అన్ని విధాలుగా సహకరిస్తోంది. క్యారమ్స్‌కు అంతర్జాతీయ ఖ్యాతితోపాటు కార్పొరేట్ హోదా తీసుకొచ్చేందుకు నాలుగేళ్ల నుంచి ఆంధ్రా క్యారమ్స్ అసోసియేషన్ పెద్దలు కృషి చేస్తున్నారు.

మూడోసారి పోటీలు..

ఈ మెగా టోర్నీని మూడోసారి నిర్వహిస్తున్నారు. తొలుత విశాఖలో 2022లో నిర్వహించగా అప్పుడు ప్రైజ్ మనీగా రూ.4 లక్షలు అందించారు. దీనిని హైదరాబాద్‌కు చెందిన గోల్కొండ వారియర్స్ గెలుచుకుంది. రెండోసారి 2023లో నిజామాబాద్‌లో రూ.7 లక్షల ప్రైజ్‌మనీతో ఏర్పాటు చేయగా టికొట్ డీజీ చాంప్స్ గెలుపొందింది. ఇప్పుడు మూడోసారి విశాఖలోని అత్యాధునిక ఎస్3 స్పోర్ట్స్ ఎరీనా స్టేడియంలో ఈ నెల 17 శుక్రవారం నుంచి నిర్వహించనున్నారు.

జట్ల ప్రత్యేకతలు

దేశంలోని ప్రఖ్యాత క్యారమ్స్ ప్లేయర్స్ పాల్గొనే ఈ సమరంలో మొత్తం 8 జట్లు పాల్గొంటాయి. ఒక్కొక్క జట్టులో ఆరుగురు పురుషులు, ఒక మహిళతో సహా ఏడుగురు ప్లేయర్స్ ఉంటారు. ఇటీవల నిర్వహించిన వేలంలో వీరిలో కొందరికి రూ.లక్ష వరకు చెల్లించి జట్లు ఎంపిక చేసుకున్నాయి. గ్రీన్ కలర్ క్యారమ్ బోర్డుపై మిల్క్ వైట్ కాయిన్స్‌తో క్రీడాకారులు తలపడతారు. జట్టు ఎంట్రీ ఫీజు రూ.3 లక్షలు. రౌండ్ రాబిన్ లీగ్‌తో ప్రారంభమై టాప్ 4 జట్లు నాకౌట్ దశకు చేరుకుంటాయి. అక్కడి నుంచి ఓటమి పొందే జట్లు టోర్నీ నుంచి తప్పుకుంటాయి. చివరకు విజేతను నిర్ణయిస్తారు. దీని కోసం ఆంధ్రా క్యారమ్స్ అసోసియేషన్ అంతర్జాతీయ రిఫరీలను నియమించింది. కొన్ని చానళ్లలో మ్యాచ్‌ల లైవ్‌కు ఏర్పాట్లు చేస్తోంది.

ప్రజలకు చేరువ చేసేందుకే



క్యారమ్స్ క్రీడలో భారత్‌కు మంచి పేరుంది. దీనిని మరింత పెంచడంతోపాటు ప్రజలకు చేరువ చేసేందుకు ఇటువంటి మెగా టోర్నమెంట్ ఉపయోగపడుతుంది. టోర్నమెంట్ నిర్వహించేందుకు ముందుకు వచ్చిన వజ్రా స్పోర్ట్స్‌కు ధన్యవాదాలు. దేశంలోని ప్రముఖ, ప్రపంచ ప్రఖ్యాత క్రీడాకారులు పాల్గొనడంతో ఔత్సాహికులకు నేర్చుకునేందుకు ఎంతో అవకాశం లభిస్తుంది.
–డాక్టర్ నీరజ్ కుమార్ సంపతి, రాష్ట్ర అధ్యక్షులు, ఆంధ్రా క్యారమ్స్ అసోసియేషన్

క్రీడాకారులకు ప్రోత్సాహం



క్రీడాకారులకు ఒక అదృష్టమనే చెప్పాలి. కార్పొరేట్ వ్యక్తులు దీనిని ప్రమోట్ చేయడంతో క్రీడాకారులకు ప్రోత్సాహంతోపాటు కొంత ఆర్థిక వెసులుబాటు లభిస్తుంది. సాధారణ క్రీడాకారుడు ప్రపంచ నంబర్ వన్‌తో పోటీపడే అవకాశం లభిస్తుంది. మూడేళ్ల నుంచి రాష్ట్రంలో క్యారమ్స్ ఆట చాలా వేగంగా అభివృద్ధి చెందుతోంది.
–షేక్ అబ్దుల్ జలీల్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆంధ్రా క్యారమ్స్ అసోసియేషన్

నన్ను చాంపియన్‌గా నిలిపింది



ఇటువంటి టోర్నీల ద్వారా దేశ, విదేశాల క్రీకారులతో తలపడే అవకాశం లభించింది. ఈ నెల 8న నెల్లూరులో జరిగిన 29వ ఆల్ ఇండియా ఫెడరేషన్ కప్ విజేతగా నిలిపింది. క్రీడాకారులు అతి సులభంగా, ఖాళీ సమయాల్లో దీనిని సాధన చేస్తే సరిపోతుంది. ఖర్చు కూడా చాలా తక్కువ. ఇప్పుడు డబ్బులు కూడా వస్తున్నాయి. ప్రభుత్వ ఉద్యోగాలు పొందే వీలుంటుంది.
–సీహెచ్.జనార్దన్‌రెడ్డి, భారత్ నంబర్ వన్ క్రీడాకారుడు

వాస్తవాలను ప్రతిబింబిచేవే నాటికలు

రెండో రోజు ఆకట్టుకున్న నాటికలు



నాటికలను ప్రారంభిస్తున్న దర్శకుడు సాంబశివరావు

యద్దనపూడి: సమాజంలో జరుగుతున్న వాస్తవాలను ప్రజలకు కళ్లకు కట్టినట్టు చూపించేవే నాటికలని రచయిత, దర్శకుడు డాక్టర్ కందిమళ్ల సాంబశివరావు అన్నారు. గురువారం మండలంలోని అనంతవరం గ్రామంలో రెండో రోజు ఎన్టీఆర్ కళా పరిషత్ ఆధ్వర్యంలో తృతీయ ఉభయ తెలుగు రాష్ట్రాల నాటిక పోటీల్లో ముఖ్య అతిథులుగా వేదిక చైర్మన్ ముత్తవరపు సురేష్‌బాబు, గుంటూరు కళాపరిషత్ అధ్యక్షులు పీవీ మల్లికార్జునరావు, సినీ, టీవీ నటుడు, దర్శకుడు నాయుడు గోపి పాల్గొన్నారు. కందిమళ్ల మాట్లాడుతూ సమాజంపై ప్రభావం చూపించటంలో నాటికల పాత్ర కీలకమన్నారు. భాష ఉన్నతికి చిరునామాగా, సామాజిక హితాన్ని కాంక్షిస్తూ ప్రజలకు విజ్ఞానాన్ని, వినోదాన్ని వాస్తవ పరిస్థితులను పంచే నాటికలకు పూర్వవైభవం రావాలని ఆకాంక్షించారు. వేదిక చైర్మన్ ముత్తవరపు సురేష్‌బాబు మాట్లాడుతూ ప్రేక్షకుల నాడి పట్టుకున్న కళలకు ఎప్పటికీ ఆదరణ ఉంటుందని, కళాకారులు, రచయితలు కూడా మారే కాలంతోపాటే మరిన్ని నాటికలను ఆవిష్కరించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. సన్మాన గ్రహీత నాయుడు గోపి మాట్లాడుతూ కళాపరిషత్‌లే కాక ప్రభుత్వాలు, ప్రైవేట్ టీవీ చానల్స్, ఆధ్యాత్మిక సంస్థలు కూడా నాటికలకు ప్రోత్సాహం అందించే ప్రయత్నం చేయాలని సూచించారు. పీవీ మల్లికార్జునరావు మాట్లాడుతూ భారతీయ సమాజాన్ని పట్టి పీడిస్తున్న అనేక వివక్షలను నాటకం, నాటికలు ఎండగట్టాయని, సామాజిక వివక్షలకు వ్యతిరేకంగా నాటిక ప్రదర్శనలు ఓ ఉద్యమమే చేసిందన్నారు. అలాంటి కళలను, కళాకారులను కాపాడుకోవాల్సిన ఆవశ్యకత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. కార్యక్రమంలో అనంతవరం కళాపరిషత్ అధ్యక్షుడు గుదే పాండురంగారావు, గుదే తారకరామారావు, మద్దినేని జయరామకృష్ణ, పెడవల్లి శ్రీనివాసరావు, పోపూరి శివసుబ్బారావు, నిమ్మల సాంబశివరావు, పెడవల్లి వెంకటేశ్వర్లు, మండవ శ్రీనివాసరావు పాల్గొన్నారు.



బ్రహ్మస్వరూపం నాటికలోని ఓ సన్నివేశం

మంచితనం వికసించినప్పుడు..

తొలినాటికగా మైత్రి కళానిలయం విజయవాడ వారి బ్రహ్మస్వరూపం నాటికలో మంచితనం వికసించినప్పుడు అందరూ మంచివాళ్లే కనిపిస్తారు. ఆ ప్రపంచంలో మనకు ఆత్మీయతలు, మమకార మాధుర్యాలు పరిభ్రమిస్తుంటాయి పరిపూర్ణమైన మనసుతో చూడగలిగితే మనకు నచ్చిన జీవితం మన కళ్ల ముందు సాక్షాత్కరిస్తోంది. కఠినమైన సందర్భాల్లో విధి విరోధిగా మారిన వేళల్లో మనం నిస్సహాయులుగా మిగిలిపోతున్నప్పుడు సాక్షాత్తూ ఆ బ్రహ్మస్వరూపమే ఆవహించి ధర్మాన్ని చెప్తుందంటూ ఇతివృత్తంగా నాటిక సాగింది.

గెలిచేదంతా నిజం కాదు..

రెండో నాటికగా యంగ్ థియేటర్ విజయవాడ వారి 27వ మైలురాయి నాటికలో.. నిజం గెలుస్తుంది అన్నది నిజమే కానీ, గెలిచేదంతా నిజం మాత్రం కాదు. ఇప్పుడున్న చాలా మంది న్యాయవాదులు తమ క్లయింట్లను గెలిపించుకునేందుకు అడ్డమైన కేసులు వాదిస్తున్నారు. సమాజానికి కీడు చేసే కేసులు వాదించకుండా ఉండటమే ఉత్తమమం అనే ప్రధానాశంగా రాయబడ్డ నాటిక 27వ మైలురాయి.

కోరికలే శత్రువులుగా..

మూడో నాటికగా వెలగలేరు థియేటర్ ఆర్ట్స్ వారి నిశి నాటికలో మదిని తొలిచే కోరికలు మనిషిని ఒక పట్టాన నిలవనియ్యవు. కోరికల మత్తులో ఏమాత్రం భయం లేకుండా అక్రమ సంబంధాలకు పాల్పడతారు. సాగినంత కాలం భాగానే సాగినా ఏదో ఒక రోజు తమ తప్పులను కప్పి పుచ్చుకోవటానికి తాను చేసే ప్రయత్నాల్లో విచక్షణ కూడా కోల్పోతాడు. ఆ సమయంలో ఎన్నో చేయరాని తప్పులు చేసి కష్టాల ఊబిలో కూరుకుపోతాడు. ఇలాంటి ఘటనలు ఎలా జరుగుతాయి వాటికి కారణాలేంటి, జరిగాక వాటి ప్రతిఫలం ఏంటి అనేదే నిశి నాటిక సారాంశం.

దుర్గమ్మ సేవలో డీజీపీ



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను రాష్ట్ర డీజీపీ ద్వారకా తిరుమలరావు దంపతులు గురువారం దర్శించుకున్నారు. ఈవో కె.రామచంద్రమోహన్ అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, పట్టువస్త్రాలను వారికి అందించారు.

అవధానానికి కేరాఫ్ నారాయణం

- రాష్ట్ర వ్యాప్తంగా 343 అష్టావధానాలు, నాలుగు శతావధానాలు
- రిటైర్ అయిన తరువాత కొనసాగింపు
- అవధానంలో ఎన్నో బిరుదులు, సత్కారాలు
- ప్రభుత్వ ప్రోత్సాహం అవసరమంటున్న అవధాని


నరసరావుపేట లయన్స్ క్లబ్ వారి నుంచి వెండి కిరీట సత్కారం అందుకుంటున్న నారాయణం

అద్దంకి: తెలుగు సాహిత్యంలో అష్టవధానానికి ఒక ప్రత్యేకత ఉంది. దేశ భాషల్లో ఏ భాషకు లేని విశిష్ట ప్రక్రియ అవధానం మన తెలుగు భాషకు ఉంది. అద్భుత ధారణా (జ్ఞాపకం) శక్తితోపాటు, తెలుగు భాష మీద, తెలుగు ఛందస్సు మీద, జాతీయ, అంతర్జాతీయ రాజకీయ, ఒకటేమిటి అన్ని విషయాల మీద అవధానికి పట్టు ఉంటేనే అవధానం పండుతుంది. వాటన్నింటి మీద పట్టు సాధించిన వ్యక్తి చేసే అవధాన ప్రక్రియ చాలా గొప్పది. ఈ ప్రక్రియ తెలుగు భాషకే సొంతం. అలా అవధానం చేయగిగిన వారిలో అద్దంకి పట్టణానికి చెందిన నారాయణం బాలసుబ్రహ్మణ్యం ఒకరు. ఈయన ఇంకొల్లు మండలం కొణికి గ్రామానికి చెందిన నారాయణం రాఘవాచార్యులు, పద్మావతమ్మ కుమారుడు. ప్రస్తుతం బాలసుబ్రహ్మణ్యం అద్దంకిలో నివాసం ఉంటున్నాడు. చిన్నప్పటి నుంచి తెలుగు భాష మీద అభిమానం పెంచుకున్న బాలసుబ్రహ్మణ్యం పదో తరగతి వరకు చదివిన తరువాత తిమ్మసముద్రం గ్రామంలో భాషా ప్రవీణ చదివారు. తరువాత ప్రైవేట్‌గా ఎంఏ చేశారు. 1984లో ప్రకాశం జిల్లా కొండపి మండలం తంగేళ్లలో ఉపాధ్యాయ వృత్తిని చేపట్టారు. 2002లో గ్రేడ్–1 తెలుగు ఉపాధ్యాయుడిగా ఉద్యోగోన్నతి పొందాడు. 2020లో మండలంలోని తిమ్మాయపాలెం గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రిటైర్ అయ్యారు.

15వ ఏటనే పద్యాల మీద ఆసక్తి..

తన 15వ ఏటనే పద్యాలు రాయడం మీద ఆసక్తి పెంచుకున్న సబ్రహ్మణ్యం అప్పట్లో రేడియోలో వచ్చే సరస వినోదిని సమస్య పూరణం చేసి రాసి పంపేవాడు.


మోపిదేవి స్ఫూర్తితో అవధానంలోకి..

తాను ప్రాచ్య కళాశాలలో చదువుతున్న రోజుల్లో అంటే 1979లో జిల్లెళ్లమూడి నుంచి వచ్చిన మోపిదేవి భాస్కర్ అష్టావధానం చేయడం చూసి స్ఫూర్తి పొందాడు. పద్యాలు రాస్తున్న తను ఎందుకు అష్టావధానం చేయకూడదనే సంకల్పంతో అటు వైపు దృష్టి మరల్చాడు. తొలి ప్రయత్నంలోనే తన కళాశాలలోనే అష్టావధానం చేసి అధ్యాపకుల మన్ననలు అందుకున్నారు. అదే పట్టుతో ఇప్పటికి 374 అష్టావధానాలు చేశాడు. ప్రముఖ శతావధానులు అపర్ణ, శాంతి స్వరూప్ స్ఫూర్తితో శతావధానం చేయాలని నిర్ణయించుకున్నారు. దాని మీద పట్టు సాధించి ఇప్పటికి నాలుగు శతావధానాలు చేశారు. ఖర్చుతో కూడుకుని ఉండటం, లక్ష వరకు ధన వ్యయం చేయాల్సి రావడంతో పెద్దగా శతావధానాలు చేయలేకపోయాడు.

ఆరు శతకాల రచన..

ఆంజనేయ, వల్లభరాయ, లలాతాంబిక, చంద్రశేఖర, అయినమల్లి గణపతి, స్వర్ణ శతకాలతోపాటు, తాను చేసిన రెండు శతావధానాలు రెండు పుస్తకాలు అచ్చయ్యాయి. బాలసుబ్రహ్మణ్యం అవధానం విన్న పెద్దలు ఆయనకు అవధాన మణి, అవధాన విశారద, అవధాన కళా ప్రపూర్ణ, అవధాన సుధాకర, అవధాన కంఠీరవ, కళాతపస్వి అనే బిరుదులు ఇచ్చారు. మరో వైపు విద్యాశాఖ విద్యార్థులకు చేస్తున్న అత్యుత్తమ బోధనకు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడి అవార్డు అందజేసింది.

అవధాన ప్రక్రియను ప్రభుత్వం ప్రోత్సహించాలి..



ప్రస్తుత సమాజానికి, అందునా ముఖ్యంగా విద్యార్థులకు అవధానం అవరం ఎంతో ఉంది. దీని వలన విద్యార్థులకు విజ్ఞానం, వినోదం, ధారణ శక్తి వస్తుంది. ఎన్నో విషయాలను తేలికగా జ్ఞాపకం పెట్టుకునే విధంగా తయారవుతారు. పిల్లలకు ఈ ప్రక్రియ నేర్పాలి. మరుగున పడిపోతున్న అవధాన ప్రక్రియను ప్రభుత్వం ప్రోత్సహించాలి. విద్యార్థులకు ఒక పాఠ్యాంశంగా చేరిస్తే చాలా బాగుంటుంది. భాష సజీవంగా ఉండాలన్నా, సమాజ హితమైన అంతరించి పోకుండా ఉండాలన్నా ప్రోత్సాహం అవసరం.

– నారాయణం బాలసుబ్రహ్మణ్యం, అష్టావధాని

20 నుంచి భూముల రీ సర్వే

ఆర్డీఓ గ్లోరియా



కోమలి(కర్లపాలెం): ఈనెల 20వ తేదీ నుంచి భూముల రీ సర్వే కార్యక్రమం జరుగుతుందని బాపట్ల ఆర్డీవో గ్లోరియా తెలిపారు. పిట్టలవానిపాలెం మండలం కోమలి గ్రామంలో గురువారం భూముల రీ సర్వేపై రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీకి ముఖ్య అతిథిగా హాజరైన ఆర్డీవో గ్లోరియా మాట్లాడుతూ రైతులకు సంబంధించిన పట్టా భూముల సర్వే నిర్వహిస్తామని తెలిపారు. కోమలి గ్రామంలో ఉన్న 1198 ఎకరాలను నాలుగు బ్లాకులుగా విభజించి సర్వే చేయనున్నట్లు చెప్పారు. సర్వే పనులకు సంబంధించిన నోటీసులు రైతులకు సర్వ్ చేయటం జరుగుతుందన్నారు. సర్వే కార్యక్రమానికి రైతులందరూ సహకరించి తమ భూములకు సంబంధించిన సమస్యలను పరిష్కరించుకోవాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శ్యామల నాగిరెడ్డి, తహసీల్దార్ మెహర్‌కుమార్, ఆర్ఐ కె.శ్రీనివాసరావు, సర్వేయర్ ఆదినారాయణ, వీఆర్వోలు, విలేజ్ సర్వేయర్లు పాల్గొన్నారు.

నేడు సుబ్రమణ్యేశ్వర స్వామి కల్యాణం


పెదపులుగువారిపాలెంలో జరిగిన శాంతి హోమంలో పాల్గొన్న భక్తులు

కర్లపాలెం: శ్రీవల్లి, దేవసేన సమేత సుబ్రమణ్యేశ్వరస్వామి శాంతి కల్యాణం శుక్రవారం ఉదయం కనుల పండువగా నిర్వహించేందుకు ఏర్పాట్లు సిద్ధం చేసినట్లు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు గురువారం తెలిపారు. పెదపులుగు వారి పాలెం గ్రామంలో వేంచేసి యున్న శ్రీవల్లి, దేవసేన సమేత సుబ్రమణ్యస్వామి ఆలయం వద్ద గురువారం విశేష పూజలు చేసి శాంతిహోమం నిర్వహించారు. శాంతిహోమం పూజా కార్యక్రమాల్లో కొందరు దంపతులతో పాటు గ్రామంలోని భక్తులు పాల్గొని పూజలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. శుక్రవారం శాంతి కల్యాణం అనంతరం భక్తులకు బాపట్ల అఖండ ఫౌండేషన్, గ్రామపెద్దల సహకారంతో అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

వీరుల ఆయుధాలకు శాంతి క్రతువులు


నాగులేరు ఒడ్డున పూజలు జరిపించి వీర్లగుడికి బయలు దేరిన వీరాచారులు

కారెంపూడి: పల్నాటి రణ క్షేత్రం కారెంపూడిలో కారెంపూడికి చెందిన కిల్లా కోటయ్య, కోటమ్మల కుటుంబీకులు తమ ఇళ్లలో ఉన్న పల్నాటి వీరుల ఆయుధాలకు శాంతి కార్యక్రమాలు నిర్వహించి పల్నాటి వీరాచారాన్ని గురువారం పునఃప్రతిష్ట చేసుకున్నారు. 60 ఏళ్ల క్రితంవరకు తమ పూర్వీకులైన వీర్లకు పెట్టుకున్న ఆ కుటుంబీకులు ఆతర్వాత మానేసి తర్వాత మళ్లీ జరిగిన పొరపాటును గుర్తించి వీర్ల ఆయుధాలకు శాంతి కార్యక్రమాల క్రతువులు నిర్వహించారు. నాగులేరు ఒడ్డున ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం వీర్లగుడికి చేరుకుని అక్కడ పోతురాజుకు నైవేద్యం, ఇతర మొక్కులు చెల్లించారు. తర్వాత వీర్లగుడికి, తర్వాత చెన్నకేశవస్వామి, వీర్ల అంకాలమ్మ తల్లిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఇళ్లకు చేరుకుని ఇళ్లలో వీర్ల అంకాలమ్మ తల్లి బుట్టను కత్తులను పెట్టి సాంబ్రాణి వేసి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అందరికీ సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో విశ్రాంత డీటీ రామకృష్ణారావు, ఎంపీపీ బొమ్మిన సావిత్రి అల్లయ్య పాల్గొన్నారు. కిల్లా పెదకోటేశ్వరరావు, చెన్నకేశవస్వామి మాజీ ట్రస్టు బోర్డు చైర్మన్ కిల్లా చినకోటేశ్వరరావు వీర్ల ఆయుధాలకు శాంతి కార్యక్రమాలు చేశారు. వీర్ల గుడి పూజారులు పూజా కార్యక్రమాలను నిర్వహించారు. కారెంపూడి రణక్షేత్రంలో వీరాచారాన్ని వదిలివేసిన వారు మళ్లీ స్వీకరించడం ఇక్కడ విశేషం. గతంలో జక్కా కుటుంబీకులు వీర్లకు పెట్టుకుని పునః ప్రతిష్ఠకు శ్రీకారం చుట్టారు. తర్వాత రణక్షేత్రంలో ఇది రెండవ కార్యక్రమం.

ఏటీఎం మోడల్‌తో నిరంతర ఆదాయం


ప్రకృతి వ్యవసాయం ద్వారా పండిస్తున్న ఆకుకూరలను పరిశీలిస్తున్న డీపీఎం అమలకుమారి

నరసరావుపేట రూరల్: ప్రకృతి వ్యవసాయంలో ఏటీఎం మోడల్ ద్వారా నిరంతరం ఆదాయం పొందవచ్చని డీపీఎం కె.అమలకుమారి తెలిపారు. పట్టణంలోని పోస్టల్‌కాలనీలో ప్రకృతి వ్యవసాయ విధానంలో ఆకుకూరలు, కూరగాయలు సాగుచేస్తున్న కోడూరి వెంకటేశ్వరరెడ్డి పొలాన్ని గురువారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రెండు ఎకరాల్లో అన్ని రకాల ఆకుకూరలు, కూరగాయలు వెంకటేశ్వరరెడ్డి పండిస్తున్నట్టు తెలిపారు. ఆకుకూరలు కట్ట రూ.10కే విక్రయిస్తున్నారని, వినియోగదారులు పొలం వద్దకే వచ్చి కొనుగోలు చేస్తున్నారని తెలిపారు. మూడు అడుగుల వెడల్పుతో బెడ్స్ వేసుకొని వాటిలో అవసరం మేరకు విత్తే దశలో, పెరిగే దశలో, పాత దశలో ఉండే విధంగా తోటకూర, చుక్కకూర, పాలకూర, గోంగూర, కొత్తిమీరతో పాటు టమాటాలు, గోరుచిక్కుడు, వంగ, మిరప, క్యాబేజీ, బెండలతో పాటు తీగజాతి కూరగాయలను పండిస్తున్నారని వివరించారు. ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల స్టాల్లో ఈ ఉత్పత్తులను అందుబాటులో ఉంటాయని తెలిపారు.

ప్రీ ఫ్యాబ్ హౌస్ నిర్మాణాలకు జనాదరణ

- పట్టణాల నుంచి పల్లెలకు విస్తరణ
- భట్టిప్రోలు బౌద్ధ స్థూపంలో ప్రీ ఫ్యాబ్ హౌస్ కంటెయినర్ పనులు
- తక్కువ ఖర్చుతో త్వరితగతిన నిర్మాణం
- ఉమ్మడి గుంటూరు జిల్లాలో వీటి నిర్మాణాలపై ఆసక్తి


భట్టిప్రోలు బౌద్ధస్థూపంలో ఏర్పాటు చేస్తున్న ప్రీ ఫ్యాబ్ కంటెయినర్

భట్టిప్రోలు: మారుతున్న కాలానికి అనుగుణంగా ఇటుకలు, ఇసుక, సిమెంట్, పిల్లర్లు అవసరం లేకుండా ప్రీ ఫ్యాబ్ హౌసెస్‌ను నిర్మించుకునేందుకు గృహ నిర్మాణదారులు మొగ్గు చూపుతున్నారు. దేశ, విదేశాలలో విశేషాదరణ చూరగొంటున్న ఈ నిర్మాణాలు తెలంగాణ నుంచి ఇప్పుడిప్పుడే ఆంధ్రప్రదేశ్‌లో విస్తరణ చెందుతుంది. సిమెంట్, ఫైబర్ ప్యానల్స్, ఐరన్‌తో వీటిని నిర్మిస్తున్నారు. భట్టిప్రోలులోని అతి ప్రాచీనమైన బుద్ధుని అస్థికలపై 2 వేల సంవత్సరాల కిందట నిర్మించిన బౌద్ధ స్థూపంలో నిర్వహిస్తున్న అభివృద్ధి పనుల్లో భాగంగా ముఖ ద్వారం వద్ద ఆర్వో ప్లాంట్, సెక్యూరిటీ సిబ్బంది ఉండేందుకు ఒక కంటెయినర్‌లో రెండు క్యాబిన్లను తెలంగాణ రాష్ట్రం సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌కు చెందిన పోలోజు వసంతాచారి ఆధ్వర్యంలో ఈ బృందం సభ్యులు అత్యాధునికమైన సాంకేతిక పరిజ్ఞానంతో రూ.3 లక్షల వ్యయంతో చేసుకున్న ఒప్పందం ప్రకారం నిర్మాణ పనులు నిర్వహిస్తున్నారు. ఇటీవల నాగార్జునసాగర్‌లో రూ.4.12 లక్షల వ్యయంతో నిర్మించిన కంటెయినర్ పనులు ఆర్కియాలజికల్ సిబ్బందికి నచ్చడంతో భట్టిప్రోలులోని పనులను కూడా అప్పగించారు. ప్రస్తుతం బౌద్ధ స్థూపంలో జరుగుతున్న పనులను ప్రతి ఒక్కరూ ఆసక్తిగా తిలకిస్తున్నారు.

ప్రయోజనాలు

- 50–60 ఏళ్ల మన్నికగా ఉంటుంది. పిల్లర్స్ లేకపోయినా డాబాపై రూమ్స్ కట్టుకోవచ్చు.
- ఇంటి భారం మొత్తం స్ట్రక్చర్‌పై పడటం వల్ల ఈ ప్రీ ఫ్యాబ్ హౌస్‌కి పునాదులు కూడా అవసరం లేదు. పాత గృహాలు వర్షం కురిసినప్పుడు కారుతున్నా కూడా పైన గదులు నిర్మించుకోవచ్చు.
- నీరు పడినా, అగ్నిప్రమాదం సంభవించినా ఏమీ కాదు. పర్యావరణ పరిరక్షణ, వాతావరణ సమతౌల్యత, వేడి రహితంగా, తగిన స్థలంలో నిర్మాణం, ధ్వని రహిత, ధృఢత్వం కలిగి ఉండటమే కాక చెదలు పట్టవు.
- క్రేన్ ద్వారా స్క్రూలు ఊడదీసుకుని మరోక ప్రాంతానికి కంటెయినర్‌ను తరలించవచ్చు. భూకంపాలు సంభవించినా ప్రాణ నష్టం వాటిల్లదు.
- ఎత్తు తక్కువైనా పెంచుకోవచ్చు.

భూకంపాలు సంభవించినా ఇబ్బంది లేదు..



భూకంపాలు సంభవించినా ప్రాణ నష్టం వాటిల్లదు. తక్కువ ఖర్చుతో త్వరితగతిన నిర్మాణం చేపట్టవచ్చు. సేమ్ బ్రిక్ వాల్ కట్టుకుంటున్నట్లు ఉంటుంది.

–పోలోజు వసంతాచారి, హుజూర్‌నగర్, తెలంగాణ రాష్ట్రం

దళితులపై కూటమి ప్రభుత్వానికి ద్వేషం

- అమలాపురం మాజీ ఎంపీ హర్షకుమార్
- పొనుగుపాడులో దళితులకు పరామర్శ


బాధితులతో మాట్లాడుతున్న మాజీ ఎంపీ హర్షకుమార్

ఫిరంగిపురం: కూటమి ప్రభుత్వానికి దళితులంటే ద్వేషం అని అమలాపురం మాజీ ఎంపీ హర్షకుమార్ అన్నారు. మండలంలోని పొనుగుపాడు గ్రామం ఎస్సీకాలనీలోని బాధిత దళితులను గురువారం ఆయన పరామర్శించారు. చర్చిగోడకు సంబంధించి కూల్చివేసిన ఘటన గురించి వారిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజకీయ బలంతో పోలీసులను అడ్డుపెట్టుకొని దళితులను నిర్బంధించి గోడ కూలగొట్టి రోడ్డు వేశారన్నారు. ఇది దారుణమైన సంఘటన అని పేర్కొన్నారు. గ్రామంలో ఎప్పుడో బ్రిటీష్ వారి కాలంలో దళితులకు చర్చి కోసం స్థలం కేటాయించారని చెప్పారు. ఇక్కడి గోడను కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత కోర్టు కేసులను కూడా పట్టించుకోకుండా కూల్చివేశారని చెప్పారు. గతంలో కూడా ప్రకాశం జిల్లా పర్చూరు నియోజకవర్గం దేవరపల్లిలో ఈ తరహా సంఘటన జరిగిందన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో దళితులకు ఉన్నతస్థానం కల్పించారని తెలిపారు. నేడు కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత దళితులపై ప్రభుత్వానికి ఎందుకింత ద్వేషం అని ప్రశ్నించారు. ఇంత జరుగుతున్నా పచ్చ మీడియా కనీసం నోరు కూడా మెదపని పరిస్థితి నెలకొందని ఆగ్రహం వ్యక్తం చేశారు. దళితులపై కక్షపూరితంగా ప్రభుత్వం వ్యవహరిస్తోందని మండిపడ్డారు. గ్రామంలో కూడా పేదదళితులు చర్చికి ఒకవైపు గోడ నిర్మించుకున్నారని, మరోవైపు డబ్బు లేక నిర్మించుకోలేదని చెప్పారు. అధికారబలంతో ఎంపీ, ఎమ్మెల్యే, ఎస్పీ, కలెక్టర్, అధికారులు కలిసి గోడను పడగొట్టించడం దారుణమన్నారు. దళిత ఎమ్మెల్యే అయి ఉండి కూడా ఇంత జరుగుతున్నా కనీసం నోరు విప్పకపోవడం సరికాదన్నారు. పేద ప్రజలు నమ్ముకున్న చర్చికి సంబంధించిన గోడను పునర్నిర్మించాలన్నారు. ప్రభుత్వం ఇచ్చిన స్థలాన్ని మరలా వారికి కేటాయించాలని డిమాండు చేశారు. సమావేశంలో స్థానిక నాయకులు గేరా కోటేశ్వరరావు, సేవా నాగరాజు, మేళం జోజిబాబులు పాల్గొన్నారు.

డ్రైవింగ్ శిక్షణ తరగతులు ప్రారంభం



పట్నంబజారు: డ్రైవర్లు విధి నిర్వహణలో బాధ్యతగా వ్యవహరించాలని ఏపీఎస్ ఆర్టీసీ రీజియన్ మేనేజర్ ఎం.రవికాంత్ చెప్పారు. గుంటూరు జిల్లా పరిధిలోని హెవీ మోటారు వెహికల్ డ్రైవింగ్ స్కూల్ 18 బ్యాచ్‌కు శిక్షణ తరగతులు గురువారం బస్టాండ్‌లో ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆర్ఎం మాట్లాడుతూ.. హెవీ డ్రైవింగ్ స్కూల్‌లో సీనియర్ డ్రైవర్ల చేత నాణ్యమైన శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డిపో –2 మేనేజర్, డ్రైవింగ్ స్కూల్ ప్రిన్సిపల్ షేక్ అబ్దుల్‌సలాం పాల్గొన్నారు.

కంప్యూటర్, ట్యాలీ కోర్సులో ఉచిత శిక్షణ

గుంటూరుఎడ్యుకేషన్: ఉన్నతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు బెంగళూరులో కంప్యూటర్, ట్యాలీ నైపుణ్యంపై ఉచిత శిక్షణతోపాటు నూరు శాతం ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నట్లు ఫౌండేషన్ ప్రతినిధి హరిప్రసాద్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. బెంగుళూరులో 35 రోజుల పాటు ఉచిత భోజన, వసతితో కూడిన శిక్షణ కల్పిస్తామని పేర్కొన్నారు. వివరాలకు 90004 87423 ఫోను నంబర్లో సంప్రదించాలని సూచించారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి



తెనాలిరూరల్: తెనాలిలో ఓ మహిళ అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. పట్టణంలోని ముత్తెంశెట్టిపాలెం నుంచి ఇస్లాంపేట వైపు వెళ్లే మార్గంలో రోడ్డు పక్కన ఆమె మృతి చెంది ఉండటాన్ని గురువారం స్థానికులు గుర్తించారు. తమిళనాడుకి చెందిన మణి అనే వ్యక్తితో 50 ఏళ్ల ఈ మహిళ కొంత కాలంగా కలిసి ఉంటోందని చెబుతున్నారు. మణి కర్రీ పాయింట్‌లో పని చేస్తుండగా, మహిళ భిక్షాటన చేసేదన్నారు. గత రాత్రి రోడ్డు పక్కన నిద్రించిన మహిళ తెల్లవారే సరికి మృతి చెంది ఉండటం చర్చనీయాంశమైంది. రాత్రి ఇద్దరూ కలిసి మద్యం తాగి గొడవపడి ఉంటారని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మహిళ ప్రైవేటు శరీర భాగాల నుంచి తీవ్రంగా రక్తస్రావం అయినట్లుగా తెలుస్తోంది. మణిని పోలీసు లు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. మహిళ మృతదేహాన్ని తెనాలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఘటనాస్థలాన్ని డీఎస్పీ బి.జనార్దనరావు, వన్ టౌన్ సీఐ వి.మల్లికార్జునరావులు పరిశీలించారు. హత్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పురస్కారాలకు ఎంపికైన తెనాలి కవులు


షేక్ అస్మతున్నీసా | డాక్టర్ రంగిశెట్టి రమేష్ | డాక్టర్ పాతూరి సుబ్రహ్మణ్యం | ఆళ్ల నాగేశ్వరరావు

తెనాలి: ప్రముఖ సాహితీ, సాంస్కృతిక, సామాజిక సేవా సంస్థ శ్రీశ్రీ కళావేదిక ఏటా బహూకరిస్తున్న తెలుగు కీర్తి జాతీయ ప్రతిభా పురస్కారాలకు తెనాలి నుంచి నలుగురు సాహితీమూర్తులు ఎంపికయ్యారు. శ్రీశ్రీ కళావేదిక, తెలుగు అసోసియేషన్ ఆఫ్ నేషనల్ అకాడమీ బుక్ ఆఫ్ రికార్డ్స్, వరల్డ్ రైటర్స్ ఫోరం, వరల్డ్ పొయెట్రీ అకాడమీ సంయుక్తంగా ఈ పురస్కారాలను ప్రదానం చేస్తున్నాయి. ఈ నెల 21వ తేదీన విజయవాడలో సాహిత్య సభలో పురస్కారాలను అందజేస్తారు. శ్రీశ్రీ కళావేదిక చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్ ఈ మేరకు సమాచారం పంపారు. పురస్కారాలను అందుకోనున్న వారిలో తెనాలికి చెందిన ప్రముఖ కవయిత్రి/తెలుగు ఉపాధ్యాయిని షేక్ అస్మతున్నీసా, రంగిశెట్టి ఫౌండేషన్ అధ్యక్షుడు డాక్టర్ రంగిశెట్టి రమేష్ (గంగాశ్రీ), సాహితీబంధువు ఆళ్ల నాగేశ్వరరావు (కమలశ్రీ), ప్రముఖ పద్యకవి డాక్టర్ పాతూరి సుబ్రహ్మణ్యం ఉన్నారు. వీరిని పట్టణానికి చెందిన పలువురు రచయితలు అభినందించారు.

యువకుడిపై హత్యాయత్నం


సుభాని

తెనాలిరూరల్: తెనాలిలో యువకుడిపై హత్యాయత్నం జరిగింది. వెండి పని చేసుకునే తేలప్రోలు గ్రామానికి చెందిన షేక్ సుభానీపై గురువారం ఉదయం నడిరోడ్డుపై ఈ హత్యాయత్నం చోటుచేసుకుంది. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరా.. తేలప్రోలుకు చెందిన షేక్ సుభానీ తన సోదరుడు బాజీతో కలిసి ఓ ఫంక్షన్‌కు మిత్రులను పిలిచేందుకు తెనాలి వచ్చాడు. గాంధీచౌక్ నుంచి కొత్తపేట వెళ్లే దారిలో రోడ్డు పక్కన నిలబడి ఉండగా తేలప్రోలుకు చెందిన అరాఫత్, ఇర్ఫాన్‌లు వచ్చి కత్తితో దాడి చేశారు. సుభానీ తీవ్రంగా గాయపడటంతో తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఘటనపై పోలీసులు విచారణ చేపట్టారు.

కోడి పందేలు వద్ద ఘర్షణ

బీరు సీసాలతో పొడుచుకున్న యువకులు

చుండూరు(వేమూరు): మద్యం బీరు సీసాలతో యువకులు పొడుచుకున్నారని ఎస్ఐ షేక్ రహిమాన్ తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం ...సంక్రాంతి సంబరాలలో భాగంగా చుండూరు మండలం కేఎస్ పల్లి సమీపంలో కోడి పందేలు నిర్వహించారు. బుధవారం చేబ్రోలు గ్రామానికి చెందిన మదాసు అక్షయకుమార్, మాటుపల్లి రాజేష్, ముసలా శ్రీనివాసరావులు కోడి పందేలు చూసేందుకు వచ్చారు. కోడి పందేలు చూసిన తర్వాత ముగ్గురు కలసి సైకిల్ స్టాండ్ వద్ద బీరు తాగుతున్నారు. అక్షయకుమార్, శ్రీనివాసరావు మధ్య మాటామాట పెరిగింది. దీంతో శ్రీనివాసరావు బీరు బాటిల్ పగలు కొట్టి అక్షయకుమార్‌ను పొడిచాడు. అనంతరం రాజేష్ బీరు బాటిల్‌తో శ్రీనివాసరావును పొడిచాడు. ముగ్గురికి గాయాలయ్యాయి. 108 వాహనంలో అక్షయకుమార్, రాజేష్‌లను తెనాలిలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. శ్రీనివాసరావును ప్రైవేటు వైద్యశాలలో చేర్పించారు. వైద్యులు వైద్య సేవలు అందిస్తున్నారు. ముగ్గురిపైన కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

25 సవర్ల బంగారు ఆభరణాలు అపహరణ


బీరువాను పరిశీలిస్తున్న సీఐ మల్లికార్జునరావు

రేపల్లె రూరల్: ఇంట్లో ఎవరూ లేని సమయంలో బంగారం అపహరణకు గురైన సంఘటన పట్టణంలోని 23వ వార్డులో చోటుచేసుకుంది. సీఐ మల్లికార్జునరావు వివరాల మేరకు.. అల్లపర్తి లావణ్య, ఆమె భర్త వాసులు ఈ నెల 2వ తేదీన బాపట్ల వెళ్లారు. వారి ఇరువురు పిల్లలు హైదరాబాద్ వెళ్లారు. బుధవారం ఆమె ఇంటికి తిరిగి రాగా అప్పటికే ఇంటి తాళం పగలగొట్టి ఉంది. ఇంట్లోని బీరువా తెరచి ఉంది. బీరువాలోని 25 సవర్ల బంగారు ఆభరణాలు కనిపించలేదు. బాధితురాలు లావణ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చెప్పారు. సంఘటనా స్థలాన్ని వేలిముద్రల బృందం పరిశీలించింది.

తప్పిపోయిన బాలుడు తల్లిదండ్రులకు అప్పగింత


బాలుడిని తల్లిదండ్రులకు అప్పగిస్తున్న పోలీస్ సిబ్బంది

మంగళగిరి (తాడేపల్లి రూరల్): ఉదయం తప్పిపోయిన బాలుడ్ని గంటల వ్యవధిలోనే తల్లిదండ్రులకు అప్పగించిన సంఘటన గురువారం పట్టణంలో చోటుచేసుకుంది. మంగళగిరి పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణ పరిధిలోని టిడ్కో గృహ సముదాయాల్లో నివాసముంటున్న దంపతులకు మతిస్థిమితం లేని కుమారుడు (8) ఉన్నాడు. గురువారం ఉదయం నుంచి కనిపించకపోవడంతో చుట్టుపక్కల ప్రాంతాలన్నీ వెదికారు. మంగళగిరి బస్టాండ్ ఎదురు రోడ్డులో ఓ గుర్తుతెలియని వాహనం సదరు బాలుడ్ని ఢీకొని వెళ్లిపోవడంతో చుట్టుపక్కల ఉన్న కొంతమంది యువకులు ఆరా తీశారు. మతిస్థిమితం లేని బాలుడు ఏమీ మాట్లాడలేకపోవడంతో పోలీసులకు అప్పగించారు. రెండు గంటల వ్యవధిలో బాలుడి తల్లిదండ్రులు పోలీస్‌స్టేషన్‌కు ఫిర్యాదు చేయడానికి వచ్చారు. అక్కడ తమ కుమారుడిని చూసి విలపించారు. కుమారుడిని పోలీసులకు అప్పగించిన యువకులకు, పోలీస్ సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు.